సాక్షి
కుమురం భీం

సోమవారం ၊ 1 ၊ జూలై ၊ 2024



ఇక సెలవు..
మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అంతిమయాత్రకు అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. అభిమాన నేతను కడసారి చూసి కన్నీటి వీడ్కోలు పలికారు. 8లో▸



సమస్యలు లేవనెత్తేదెవరు?
కెరమెరి మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నారు. ఎంపీటీసీలకు ఇదే చివరి సమావేశం కానుంది. వివిధ సమస్యలు సభ దృష్టికి రానున్నాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.4 /27.4

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ పెరుగుతుంది. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లాలో 30 పోలీసు యాక్ట్ కొనసాగింపు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఈ నెల 31 వరకు 30 పోలీసు యాక్ట్(1861) అమలులో ఉంటుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో పోలీసు ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఎలాంటి పబ్లిక్ సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించొద్దన్నారు. ప్రశాంతతను కాపాడేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉద్యోగులకు విరమణ సహజం



రాజబాబును సన్మానిస్తున్న అదనపు ఎస్పీ

ఆసిఫాబాద్‌అర్బన్: ఉద్యోగులకు విరమణ సహజమని అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు తెలిపారు. 42 ఏళ్ల సుదీర్ఘ సర్వీసు అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఎస్సై రాజబాబును ఆదివారం తన కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. రాజబాబు 1983లో పోలీసు శాఖలో ఏఆర్ కానిస్టేబుల్‌గా నియామకమై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో కూంబింగ్, వివిధ రకాల ఆపరేషన్స్‌లో పాల్గొన్నారని తెలిపారు. 1990లో సివిల్ కానిస్టేబుల్‌గా కన్వర్షన్ తీసుకొని, 2014లో ఏఎస్సైగా ప్రమోషన్ పొంది, 2018లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు విజయ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మన్ కీ బాత్' వీక్షణ



మన్‌కీ బాత్ వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ కార్యకర్తలతో కలిసి వీక్షించారు. మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పలు అంశాలపై మాట్లాడారని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం సాధించడమే తమ లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చన్కపురి గణపతి, కోశాధికారి అరుణ్‌లోయా, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పారెపల్లి రాణి, పట్టణ ప్రధాన కార్యదర్శి చేరాల శ్రీనివాస్, నాయకులు దెబ్బటి శ్రీనివాస్, చాంద్‌పాషా, రవికాంత్, రవి, కృష్ణ,స్వామి, సంతోశ్, ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక



క్లబ్ అధ్యక్షుడిని సన్మానిస్తున్న నారాయణరెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): లయన్స్ క్లబ్ ఆఫ్ గోలేటి స్పోర్ట్స్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా పిండి సదానందం, కార్యదర్శిగా మారిన చందర్, కోశాధికారిగా అన్నం రమేశ్, డైరెక్టర్లుగా వంగా మహేందర్‌రెడ్డి, కలకోట్ల భాస్కర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 320జీ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ నారాయణరెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని సూచించారు. రీజియన్ చైర్‌పర్సన్ అరికిల్ల రాజయ్య, జోన్ చైర్‌పర్సన్ రైతు వెంకటేశం, సభ్యులు ఉజ్వల్ కుమార్ బెహారాలు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- అధికారులు ప్రజలతో మమేకం కావాలి
- రాష్ట్ర మంత్రి సీతక్క
- జిల్లాలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

కాగజ్‌నగర్‌రూరల్/ఆసిఫాబాద్‌రూరల్/రెబ్బెన: రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి అంకిత భావంతో పని చేసి అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంతోపాటు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, రెబ్బెన, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల్లో ఆదివారం విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించారు. ముందుగా కాగజ్‌నగర్ పట్టణంలోని శ్రీరాంనగర్‌లో పల్లె దవాఖానా, ఈజ్‌గాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఏఎంసీ ఆవరణలోని మిషన్ భగీరథ అర్బన్ వాటర్ సప్లై పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. అధికారంలోని లేని సమయంలో సైతం ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు కృషి చేశామన్నారు. రాజకీయాలతో ప్రమేయం లేకుండా అధికార యంత్రాంగం ప్రజాసంక్షేమం కోసం కృషి చేస్తుందని, ఇలాంటి పరిస్థితుల్లో వారిపై ఎలాంటి ఒత్తిడి లేకుండా అభివృద్ధికి సహకరించాలని కోరారు. అధికారులు ప్రజలతో మమేకమై సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందేలా పర్యవేక్షించాలన్నారు. అధికారుల బదిలీలలో రాజకీయ ప్రమేయం ఏమాత్రం ఉండదని స్పష్టం చేశారు.



శ్రీరాంనగర్‌లోని పల్లె దవాఖానాను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క, పక్కన ప్రజాప్రతినిధులు, అధికారులు

నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ కార్యవర్గసభ్యులు రైతుల సంక్షేమం కోసం అధికారుల సమన్వయంతో పని చేయాలని సూచించారు. పోడు భూముల విషయంలో నిబంధనల ప్రకారం సాగులో ఉన్న భూములకు సంబంధించిన అంశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. అటవీ అధికారులు పోడు భూముల సమస్యపై ఆయా ప్రాంతాల్లోని రైతులతో సమావేశాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న భూముల జోలికి వెళ్లొద్దని అధికారులకు ఆదేశాలిచ్చామని తెలిపారు. పోడు రైతులు కొత్తగా పోడు భూములు కొట్టవద్దని, పాత భూములను వదలవద్దని సూచించారు. అడవుల సంరక్షణ అందరి బాధ్యతని అన్నారు.

సమాజంతో పోటీ పడేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి

సమాజంతో పోటీ పడేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. రెబ్బెన మండలంలోని నవేగాం, రెబ్బెన, కైరిగాంలోని పల్లె దవాఖానాలతో పాటు గంగాపూర్ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం అదనపు తరగతి గదులను ఆదివారం ప్రారంభించారు. గంగాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు గొప్ప లక్ష్యాలను ఎంచుకుని ఉన్నత విద్యాభ్యాసనతో సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని సూచించారు. వర్షాకాలంలో విష జ్వరాలు, విష పురుగుల బారిన పడకుండా విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. పోటీ ప్రపంచంలో ఒక్క మార్కు తేడాతో ర్యాంకులు దూరమవుతాయని, ఇష్టం, పట్టుదలతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. పాఠశాల ఆవరణను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతీ విద్యార్థి ఒక మొక్కను దత్తత తీసుకుని దాని సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. నూతనంగా నిర్మించిన భవనంలోని తరగతి గదులను పరిశీలించారు. అనంతరం సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల్లోని కేజీబీవీ భవనాలను ప్రారంభించారు. వర్షం కారణంగా కార్యక్రమాలను వేగంగా ముగించారు. ఆయా కార్యక్రమాల్లో ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, వేణు, ఆర్డీవో సురేశ్, డీఈవో అశోక్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ, నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు దేవయ్య, మల్లన్న, జెడ్పీటీసీలు అరిగెల నాగేశ్వర్‌రావు, వేముర్ల సంతోష్, ఎంపీపీ మల్లికార్జున్, మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, కేజీబీవీ ఎస్‌వో పద్మ, ఎంపీటీసీ హరిత, నాయకులు తదితరులు ఉన్నారు.

డైట్ కళాశాల ప్రారంభం



డైట్ కాలేజీని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్ పంచాయతీ పరిధిలో రూ.4కోట్ల వ్యయంతో నిర్మించిన డైట్ కళాశాల, జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను మంత్రి సీతక్క ప్రారంభించారు. డైట్ కాలేజీలో ప్రస్తుత విద్యా సంవత్సరం తరగతుల కోసం జూలై 7న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డైట్ కాలేజీ నుంచి మెయిన్ రోడ్డు వరకు వచ్చేందుకు రహదారి నిర్మించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అధికారులకు సూచించారు.

'పోడు' సమస్యలు పరిష్కరించండి : ఎమ్మెల్యే హరీశ్‌బాబు

సిర్పూర్ నియోజకవర్గంలో పోడు భూముల సమస్య తీవ్రంగా ఉందని సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్ సభలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం పోడు రైతులపై దయాదాక్షిణ్యాలు లేకుండా వ్యవహరించిందన్నారు. కనీసం కొత్త ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పునరుద్ధరించి సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాల నియోజకవర్గాలకు సాగునీరు అందించేందుకు కృషి చేయాలన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

ప్రారంభోత్సవంలో పాల్గొనకుండానే వెనుదిరిగిన ఎమ్మెల్యే

- కాంగ్రెస్ జెండాలు పెట్టడంపై కోవ లక్ష్మి ఆగ్రహం

రెబ్బెన: మండలంలోని నవేగాం, రెబ్బెన, కైరిగాం పల్లె దవాఖానాలతో పాటు గంగాపూర్ కేజీబీవీలో అదనపు తరగతుల ప్రారంభోత్సవాల్లో పాల్గొనకుండానే ఎమ్మెల్యే కోవ లక్ష్మి వెనుదిరిగి వెళ్లిపోయారు. నవేగాంలో పల్లె దవాఖానా ప్రారంభోత్సవానికి మంత్రి సీతక్క కంటే ముందే ఎమ్మెల్యే కోవ లక్ష్మి గ్రామానికి చేరుకున్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద ఫ్లెక్సీలో ఇన్‌చార్జి మంత్రితోపాటు డీసీసీ అధ్యక్షుడి ఫొటోలు ఉండటం, వేదిక చుట్టూ కాంగ్రెస్ పార్టీ జెండాలు ఏర్పాటు చేయటంపై అసహనం వ్యక్తం చేశారు. దీనిపై డీఎంహెచ్‌వోకు ఫోన్ చేసి మాట్లాడారు. ఇది అధికారిక కార్యక్రమమా.. లేక కాంగ్రెస్ పార్టీ కార్యక్రమమా.. వేదికపై కాంగ్రెస్ పార్టీ నాయకుడి ఫొటోతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం ఏంటని ప్రశ్నించారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి అక్కడి నుంచి వెళ్లిపోయారు.



అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

బీఆర్‌ఎస్ కార్యకర్తల నిరసన

అధికారిక కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలా మార్చి ఎమ్మెల్యే కోవ లక్ష్మిని అగౌరవపర్చారని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రంలో నిరసన తెలిపారు. పల్లె దవాఖానా భవనం వద్దకు డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు రాగా ఆయనతో వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు పోటాపోటీగా నినాదాలు చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు జోక్యం చేసుకుని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను అక్కడి నుంచి పంపించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

ఉచ్చు బిగిస్తున్న ఏసీబీ

- 'జాతీయ రహదారి' అక్రమాలపై విచారణ వేగవంతం
- ఆర్డీవో సిడాం దత్తును అదుపులోకి తీసుకుని కరీంనగర్‌కు తరలింపు
- రియల్ ఎస్టేట్ వ్యాపారులను కూడా విచారిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్: జిల్లాలో జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భూములకు సంబంధించి పరిహారం చెల్లింపుల్లో జరిగిన అక్రమాలపై ఏసీబీ దూకుడు పెంచింది. ఈ క్రమంలో అక్రమాలకు పాల్పడిన అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులపై ఉచ్చు బిగిస్తోంది. గతంలో ఆసిఫాబాద్ ఆర్డీవోగా పని చేసిన సిడాం దత్తు(ప్రస్తుతం వరంగల్ ఆర్డీవో)తోపాటు డిప్యూటీ తహసీల్దార్ మెస్రం నాగోరావు, జిల్లా కేంద్రానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు సుబ్బ శంభుదాస్, లక్ష్మీనారాయణ గౌడ్‌ను ఏసీబీ అధికారులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. వారిని కరీంనగర్‌లోని ఏసీబీ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నారు.

మేలో ఫిర్యాదులు

జిల్లాలోని రెబ్బెన మండలం నుంచి వాంకిడి మండలంలోని గోయగాం వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేషనల్ హైవే విస్తరణకు సంబంధించి సేకరించిన భూములకు ప్రభుత్వం పరిహారం చెల్లించింది. ఈ పరిహారం చెల్లింపుల్లో దాదాపు రూ.4కోట్లకు పైగా నగదు పక్కదారి పట్టినట్లు మేలో ఫిర్యాదులు అందాయి. ఏసీబీ అధికారులు ప్రాథమిక విచారణ అనంతరం కేసు నమోదు చేశారు. డ్రైవర్ తిరుపతి బ్యాంకు అకౌంట్ నుంచి ఆర్డీవో సిడాం దత్తు తల్లి సిడాం మల్కుబాయి ఖాతాలోకి రూ.65 లక్షలు ట్రాన్స్‌ఫర్ అయినట్లు గుర్తించారు. అలాగే డీటీ మెస్రం నాగోరావు సోదరుడు మెస్రం చత్రుషా ఖాతాల్లోనూ భారీ నగదు జమ అయినట్లు తేల్చారు. ఈ నేపథ్యంలో ఈ కేసుతో సంబంధం ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు.



జిల్లా కేంద్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారిని అదుపులోకి తీసుకుంటున్న ఏసీబీ అధికారులు

ఆగని అవినీతి..

జిల్లాలో ఏళ్లుగా పాతుకుపోయిన అధికారులు కొంతమంది అక్రమార్జన ద్వారా రూ.కోట్లు కూడబెట్టుకుంటున్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల పేర ఆస్తులు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ఏసీబీ అదుపులోకి తీసుకున్న సిడాం దత్తు 2019లో ఆసిఫాబాద్ ఆర్డీవోగా పని చేశారు. ఆయన హయాంలో జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైనట్లు అనేక ఆరోపణలు ఉన్నాయి. గిరిజన భూముల్లో గిరిజనేతరులు వెంచర్లు వేసి విక్రయించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై రూ.కోట్ల అక్రమార్జనకు పాల్పడ్డారు. నాలుగు వరుసల రహదారి పనుల్లో భాగంగా భూములు కోల్పోయిన కొందరు రైతులకు ఆయాచిత లబ్ధి చేకూర్చి వారి నుంచి రూ.కోట్లు సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఓ వెంచర్‌లోని కొంతభూమి హైవేలో పోగా.. ఇందులో 10 శాతం ప్రభుత్వానికి మార్టిగేజ్ చేసినప్పటికీ సదరు భూమికి కూడా నష్టపరిహారం చెల్లించారు. అలాగే కల్యాణలక్ష్మి పథకంలో కెరమెరి మండలానికి చెందిన ఆన్‌లైన్ కేంద్రాలు నిర్వహించే ముగ్గురు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి రూ.21 లక్షలు స్వాహా చేశారు. గతంలో జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్‌గా పనిచేసిన ఓ ఉద్యోగి భూముల కొలతల్లో చేతివాటం ప్రదర్శించి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మర్యాద తప్పుతున్న పోలీసు!

- కాగజ్‌నగర్ డివిజన్‌లో ఓ ఎస్సై నిర్వాకం
- స్టేషన్‌కు వచ్చే వారికి మర్యాదే ఉండదు..
- బూతులతోనే మాటలు
- గతంలోనూ ఆయన తీరు వివాదాస్పదమే..!

సాక్షి, ఆసిఫాబాద్: 'స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా వ్యవహరించండి. ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి..' ఇటీవల పలు మండలాల్లోని పోలీస్ స్టేషన్లను సందర్శించిన సమయంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సిబ్బందితో మాట్లాడిన మాటలివి. కానీ పోలీసులు వాటిని పాటిస్తున్నట్లు కనిపించడం లేదు. మండలాల్లో ఎస్సైల ప్రవర్తన జిల్లా పోలీసు అధికారుల ప్రకటనలకు భిన్నంగా ఉంటోంది. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని ఓ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్సై పద్ధతి స్టేషన్‌కు వెళ్లే ప్రజలను ఇబ్బంది పెడుతోంది. మర్యాద తప్పి ఆయన వ్యవహరించే తీరు వారిని భయాందోళనకు గురిచేస్తోంది.

బూతు పురాణం వినాల్సిందే..

కౌటాల సర్కిల్‌లోని ఓ సరిహద్దు మండలంలోని ఈ పోలీస్ స్టేషన్‌కు వెళ్లే బాధితులు, ఫిర్యాదుదారులు ఎవరైనా సరే సదరు ఎస్సై బూతు పురాణం వినడానికి సిద్ధం కావాల్సిందే. రాజకీయ నాయకుల అండదండల కోసం ఎంతకైనా తెగిస్తారనే ప్రచారం జరుగుతోంది. సదరు ఎస్సై పని చేస్తున్న మండలంలోని ఓ గ్రామంలో జరిగిన అక్రమ ఇసుక వివాదంలో నిర్లక్ష్యంతో వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగానే ఘటన వివాదాస్పదంగా మారిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ సరిహద్దు మండలంలో నకిలీ విత్తనాల సరఫరాను అరికట్టడంలో సదరు ఎస్సై విఫలం కాగా.. టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో మాత్రం భారీగా నకిలీ విత్తనాలు పట్టుబడ్డాయి. మరోవైపు మండలం నుంచి మహారాష్ట్రకు భారీ టిప్పర్లలో నిబంధనలకు విరుద్ధంగా కంకర తరలింపుపై ప్రజలు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అక్రమార్కులకు ఎస్సై అనుకూలంగా వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులు సదరు కంకర కాంట్రాక్టర్ ఇచ్చిన విందుకు కూడా హాజరైనట్లు సమాచారం.



భూ వివాదాల్లో జోక్యం

గ్రామాల్లోని భూవివాదాల్లో ఎస్సై తలదూర్చి ఓ వర్గానికి అనుకూలంగా వ్యవహరించడంపై బాధితులు మండిపడుతున్నారు. న్యాయం చేయాల్సిన చోట ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ గ్రామంలోని భూవ్యవహారంలో వారసుల మధ్య వివాదం ఉండగా.. వారిలో ఒక సోదరుడు మరణించాడు. అతడి భార్య కోర్టు నుంచి వారసత్వ ధృవీకరణ తీసుకువచ్చింది. కోర్టు ఆదేశాలను సైతం సదరు ఎస్సై తోసిపుచ్చారు. 'రూ.10వేలు పడేస్తే లాయర్లు వంద కాగితాలు రాసి ఇస్తారు' అంటూ వ్యాఖ్యానించడంతో బాధితులు అవాక్కయ్యారు. ఇదే వివాదంలో సదరు వితంతు మహిళతో ఫోన్‌లో దురుసుగా మాట్లాడినట్లు తెలిసింది. భూమిలోకి వెళ్తే కేసు పెడతానని సదరు మహిళను బెదిరించి గతంలో బతికినట్లే కూలి పని చేసుకోవాలని తీర్పునివ్వడం ఆయన తీరును తెలియజేస్తోంది. కోర్టు ధృవీకరణను తోసిపడేయడంతోపాటు దురుసుగా వ్యవహరించడంపై భయభ్రాంతులకు గురైన బాధితులు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

గతంలోనూ వివాదాలే..

సదరు ఎస్సై గతంలో మంచిర్యాల జిల్లాలోని ఓ మండలంలో పని చేసిన సమయంలోనూ వివాదాస్పదంగా వ్యవహరించారు. ఓ భూవివాదంలో జోక్యం చేసుకోవడంతోపాటు ఒక వర్గానికి అనుకూలంగా వ్యవహరించడం, నకిలీ విత్తనాలు, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టడంలో నిర్లక్ష్యం వహించి అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటిపై ఉన్నతాధికారులు విచారణ జరిపించారు. విచారణ అనంతరం ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది.

డీఏవో గ్రేడ్– 2 పరీక్షలు షురూ



అభ్యర్థిని తనిఖీ చేస్తున్న భద్రత సిబ్బంది

కైలాస్‌నగర్: టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్ (వర్క్స్) గ్రేడ్– 2 ఆన్‌లైన్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. స్థానిక నలంద డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్వహించిన పరీక్షకు వంద మందికి గాను 63 మంది హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించిన పరీక్షకు గాను 60 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఒకే భవనం ఇద్దరు ప్రారంభించారు



పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు




పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ కృష్ణారావు

దహెగాం(సిర్పూర్): ఒకే భవనాన్ని ఎవరికి వారే అన్నట్లుగా రెండు పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. దహెగాం మండల కేంద్రంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.56 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోసం నూతన భవనం నిర్మించారు. ఈ భవనాన్ని రాష్ట్ర మంత్రి సీతక్క జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం ప్రారంభించాల్సి ఉంది. కానీ అనివార్య కారణాలతో మంత్రి పర్యటన రద్దయింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ముందుగా మధ్యాహ్నం పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభించారు. గదులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించిందని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అనంతరం జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు అదే భవనాన్ని సాయంత్రం మూడు గంటల సమయంలో ప్రారంభించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కంబగౌని సులోచన, జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు, ఎంపీటీసీ జయలక్ష్మి, సహకార సంఘం చైర్మన్ తిరుపతిగౌడ్, వైస్ చైర్మన్ ధనుంజయ్, పీఆర్ ఈఈ ప్రభాకర్, డీఈ రామ్మోహన్ రావు, జేఈ రాజ్‌కుమార్, డిప్యూటీ డీహెంచ్‌వో సీతారాంనాయక్, ఎంపీడీవో రాజేందర్, వైద్యాధికారి అశ్విని పాల్గొన్నారు.

అందవెల్లి వంతెనపై ఆటోలు, బైక్‌లకే అనుమతి

దహెగాం: కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగుపై వంతెనపై కేవలం ప్రయాణికులు లేని ఆటోలు, ద్విచక్ర వాహనాలకు మాత్రమే అనుమతినిస్తున్నారు. ఇటీవల వచ్చిన వరదతో పెద్దవాగులో తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. కాగజ్‌నగర్, భీమిని, దహెగాం మండలాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వంతెన ప్రారంభం కోసం ఎమ్మెల్యే హరీశ్‌బాబు దీక్షకు దిగారు. దీంతో సంబంధిత అధికారులు మట్టితో అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి చేసి తాత్కాలికంగా రాకపోకలు పునఃప్రారంభించారు. వంతెన పనులు పూర్తయినా బేరింగ్ కోట్ ఇటీవల వేయడంతో వాటర్ క్యూరింగ్ కొనసాగుతోంది. అలాగే హ్యాండ్ రేయిల్స్ పనులు సైతం కొనసాగుతున్నాయి. ఫోర్ వీలర్స్ వెళ్లకుండా పోలీసులు నిత్యం బందోబస్తు చేపడుతున్నారు. లోడ్‌తో వెళ్తున్న ఆటోలను సైతం అనుమతించడం లేదు. కేవలం ఖాళీ ఆటోలు, బైక్‌లను రాకపోకలకు అనుమతిస్తున్నారు. ఆటోల్లోని ప్రయాణికులు కాలినడకన వంతెన దాటి మళ్లీ ఆటోలు ఎక్కుతున్నారు. ఆటోల్లో సామగ్రి ఉన్నా పోలీసులు అడ్డుకుంటున్నారు. మరో వారం, పది రోజుల్లో పూర్తిస్థాయి వంతెన అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు.



వంతెన వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ఇక సెలవు..



భౌతిక ఖాయం వద్ద నాయకుల నివాళులు

- ముగిసిన రాథోడ్ రమేశ్ అంత్యక్రియలు
- అంతిమ యాత్రలో కిక్కిరిసిన జనం..
- ముఖ్య నేతల నివాళులు



అంత్యక్రియల్లో పాల్గొన్న ఐకేరెడ్డి, జోగు రామన్న, పురాణం సతీశ్, వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: బీజేపీ జాతీయ నాయకుడు, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అంత్యక్రియలను ఆదివారం ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులో నిర్వహించారు. అంతకుముందు ఉదయం 11గంటలకు పాత ఉట్నూర్, పెర్కగూడ మీదుగా ఎక్స్‌రోడ్డు వరకు అంతిమయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ – మంచిర్యాల ప్రధాన రహదారులు జనాలతో కిక్కిరిసిపోయాయి. శనివారం రాత్రి 2 గంటలకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ రాథోడ్ రమేశ్ స్వగృహానికి చేరుకొని పార్థివదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ఎంపీగా, జెడ్పీచైర్మన్‌గా, ఎమ్మెల్యేగా రాథోడ్ రమేశ్ చేసిన సేవలను కొనియాడారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎమ్మెల్సీలు పురాణం సతీశ్, రాములు నాయక్, ఎమ్మెల్యేలు జాదవ్ అనీల్, రామారావు పటేల్, మాజీ మంత్రులు ఐకేరెడ్డి, జోగు రామన్న అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మంత్రి సీతక్క బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పెద్ద ఎత్తున రాథోడ్ రమేశ్ అభిమానులు తరలిరావడంతో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



అంత్యక్రియలకు హాజరైన ప్రజానీకం

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బెల్లూరి శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వండాల బాలకృష్ణ (36) దుర్మరణం చెందినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బాలకృష్ణ గతేడాది నుంచి భార్యతో కలిసి మహారాష్ట్రలో నివాసం ఉంటున్నాడు. ఇదే క్రమంలో శనివారం ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని చాందాలో ఆయన బంధువుల ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బెల్లూరిలోని అయ్యప్ప ఆలయ సమీపంలో గల సైన్‌బోర్డుకు ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

‘ట్రిపుల్’ ట్రబుల్స్ ఎవరికీ పట్టవా?

- విద్యార్థుల ఇబ్బందులు పట్టించుకోరు
- వారికి మాట్లాడే అవకాశం కూడా లేదు..
- క్యాంపస్‌పై ప్రభుత్వం దృష్టి పెట్టదు..
- వర్సిటీలో అంతా రహస్యమేనా?



బాసర ట్రిపుల్ ఐటీ

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ అంటే రాష్ట్ర వ్యాప్తంగా అందరికీ తెలిసిందే... కానీ ఇక్కడ చదివే విద్యార్థుల సమస్యలు మాత్రం ఎవరికీ తెలియవు. ఏం జరిగినా గుట్టుగా ఉంచడం రహస్య క్యాంపస్‌గా మార్చడమే ఉన్నతాధికారుల లక్ష్యంగా కనిపిస్తోంది. చదువుకునే పిల్లలకు జైలు వాతావరణం తలపించే పరిస్థితులు కనిపిస్తున్నా ఏ ఒక్కరూ నోరు మెదపడం లేదు. తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఓ కమిటీ వేసుకుందామన్నా అనుమతించడం లేదు. కమిటీ కోసం దరఖాస్తు చేసుకుంటే ఏదో ఒక వంక చూపి విద్యార్థులను ఇబ్బందులు పెట్టడమే కాకుండా వారికి కమిటీ వేసుకునే పరిస్థితులను మరింత క్లిష్టం చేస్తున్నారు. విద్యార్థుల ఆందోళనలు, నిరసనలు ఇలా ఏదో ఒక విషయంలో ట్రిపుల్‌ఐటీ ఎప్పుడూ వార్తల్లో కనిపిస్తున్నా శాశ్వత పరిష్కారం మాత్రం ఎవరూ చూపడం లేదు. ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్యలకు సైతం పాల్పడ్డారు. బాసర ట్రిపుల్‌ఐటీ రహస్య క్యాంపస్‌గా మారింది. అక్కడ ఏంజరిగినా బయటకు తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు. మీడియా, విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, మేధావులు ఎవరైనా సరే లోపలికి మాత్రం అనుమతించరు.

ఆందోళనకు సిద్ధమవుతున్న విద్యార్థులు..

మరోవైపు తమ సమస్యల పరిష్కారం కోసం ఇక్కడ చదివే విద్యార్థులంతా ఆందోళనకు సిద్ధమవుతున్నారు. రెండేళ్ల క్రితం చేపట్టిన ఉద్యమంలాగే ఇప్పుడు కూడా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. గతంలో కొంతమంది విద్యార్థులే టార్గెట్‌గా చేసి కేసులు పెట్టారు. ఇప్పుడు విద్యార్థులంతా ఐక్యంగా వెళ్లి తమ సమస్యలు వినిపించి కమిటీ వేసి పోరాడాలని ఆలోచిస్తున్నారు. క్యాంపస్ అధికారులు కమిటీకి అనుమతించాలని కోరుతున్నారు. నిబంధనల పేరిట కాలయాపన చేస్తే విద్యార్థులంతా ఐక్యంగా నిరసనలకు దిగాలని నిర్ణయించారు. తమ సమస్యలను వినకుంటే నిరవధిక ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. ఏళ్ల తరబడి సమస్యలతో సహవాసం చేస్తున్న తమ ఇబ్బందులు తీర్చే మార్గం చూపాలని కోరుతున్నారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ జనవరిలో అసెంబ్లీలోనూ ట్రిపుల్ ఐటీ ప్రక్షాళన చేపట్టాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా దృష్టి పెట్టి ట్రిపుల్ ఐటీ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

భరోసా లేక...

తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసాగా ఉంటుందనుకునే ప్రతిష్టాత్మక బాసర ట్రిపుల్‌ఐటీలో ఇటీవలి కాలంలో వరుసగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తాజాగా మరో విద్యార్థి తన నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నాడు. వేలాది మంది ఉండే ఈ క్యాంపస్‌లో చదివే విద్యార్థులకు మనోధైర్యం ఇచ్చే వాళ్ళు లేకపోవడమే ఇందుకు కారణంగా భావిస్తున్నారు. రోజూ చదివే విద్యార్థులపై యూనివర్సిటీ అధికారులు దృష్టి పెట్టలేకపోతున్నారు. 9వేల మంది విద్యార్థులు ఉండే ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో తరగతి గదుల్లో నీరసంగా, అసహనంగా, ఒంటరిగా ఉండే వారిని పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చి మనోధైర్యాన్ని కల్పిస్తే ఆత్మహత్యలు కాస్తయినా ఆగుతాయి. విద్యార్థులు ఒత్తిడిలో చదువుతారు. చదువు పూర్తవుతున్న సమయంలోనూ ప్లేస్‌మెంట్, కుటుంబ పరిస్థితులు ఇతర వ్యసనాలు వారిలో పదేపదే మానసిక ఒత్తిడిని పెంచుతుంటాయి. ఈ ఒత్తిడిని తగ్గించేలా క్యాంపస్‌లో క్రీడలు, సంగీతంపై మక్కువ పెంచేలా చూడాలి. వారానికి ఒక్కరోజైనా విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య అన్నింటినీ మరిచి మానసిక ప్రశాంతతను పొందేలా వారిని ప్రేరేపించాలి. ఇష్టమైన రంగంలో ఆటలు ఆడుకునేవీలు కల్పించాలి. ఎంతోమంది విద్యార్థులు ఉన్న ఈ క్యాంపస్‌లో అప్పుడప్పుడు వినోదాన్ని పంచే కార్యక్రమాలు నిర్వహించాలి. విద్యార్థులంతా ఒంటరిగా ఉండకుండా ఎవరితోనైనా తమ బాధలు చెప్పుకునేలా పరిస్థితులు కల్పించాలి. భయం మధ్య, ఏంజరుగుతుందోనన్న క్షణాల మధ్య తరగతి గదుల్లో, వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు ఇలా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

ఖాళీ లేక...

విద్యార్థులు ప్రతీరోజు ఆటలు ఆడుకునేలా షెడ్యూల్ ఉంచాలి. ఉదయం నిద్రలేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు స్నానాలు, భోజనాలు, తరగతి గదులు వీటితోనే రోజు పూర్తవుతుంది. రోజుకు అరగంటైనా విద్యార్థులంతా ఇష్టమైన క్రీడల్లో పాల్గొనేలా ఏ ఒక్కరూ చూడడంలేదు. క్రీడల్లో ఉన్న విద్యార్థులు మానసిక ఒత్తిడికి కాస్త దూరమవుతారు. వారంలో ఒక్కరోజైనా చెవులకు ఇంపైన సంగీతం, వినోద కార్యక్రమాలు తిలకించే ఏర్పాట్లు చేయాలి. కానీ అవేం ఇక్కడ జరగడంలేదు. విద్యార్థుల పరిస్థితిపై ఎప్పటికప్పుడు సైకాలజిస్టులతో కౌన్సిలింగ్‌లు ఇప్పిస్తూ మానసికస్థితిని తెలుసుకోవాలి. ఒంటరిగా ఉండే విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులను పిలిచి గతంలో ఎలా ఉండేవారు? ఇప్పుడు ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడు అనే విషయాలు చర్చించాలి. క్యాంపస్ అధికారులు మార్చలేకపోయిన ఒంటరితనాన్ని గుర్తించి కుటుంబ సభ్యులైనా వారికి మనోధైర్యం కల్పించి ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తపడే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల పరిస్థితులు తెలుసుకుని వారి మనసుకు అనుగుణంగా నడుచుకుని ఆత్మహత్యలకు అడ్డుకట్టవేయాలని పోషకులు కోరుతున్నారు.

సీఎం సార్ వస్తేనే...

నాటి ప్రభుత్వంలో బాసర ట్రిపుల్‌ఐటీలో ఆంక్షలపేరుతో ఎవరినీ అనుమతించలేదు. గతేడాది డిసెంబర్ 7న తెలంగాణ రాష్ట్ర సీఎంగా ప్రమాణం స్వీకారం చేసిన రేవంత్ రెడ్డి ప్రగతిభవన్‌ను ప్రజాభవన్‌గా మార్చారు. ప్రగతిభవన్ ఎదుట ఉన్న ఇనుప కంచెను తొలగించారు. అక్కడే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. కానీ బాసర ట్రిపుల్‌ఐటీలో మాత్రం నేటికీ పాత ఆంక్షలే కొనసాగిస్తున్నారు. క్యాంపస్ చుట్టూ ఉన్న భారీ ప్రహరీ దాటి లోనికి ఎవరూ వెళ్లలేరు. పైగా తల్లిదండ్రులను కూడా అనుమతించడం లేదు. ఇంటి నుంచి వండుకొచ్చిన భోజనాలు విద్యార్థులకు పెడదామన్నా పంపించడం లేదు. క్యాంపస్‌కు ఇరువైపులా భారీ గేట్లు నిర్మించి ఎవరినీ అనుమతించడం లేదు. విద్యార్థులకు సమస్యలు చెప్పుకునే అవకాశం కూడా కల్పించడంలేదు. సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా బాసర ట్రిపుల్‌ఐటీకి వచ్చి సమస్యలు తెలుసుకుని శాశ్వత పరిష్కారానికి మార్గం చూపుతారని ఇక్కడి విద్యార్థులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధుడు మృతి



పోశమల్లు మృతదేహం

బెల్లంపల్లిరూరల్: విద్యుత్‌షాక్‌తో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై జి.నరేశ్, ఏ ఎస్సై రాజన్న తెలి పిన వివరాల ప్రకారం మండలంలోని బుధాకుర్దు గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డు కార్మికుడు మేడం పోశమల్లు (73) ఇంట్లో ఆదివారం ఉదయం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. దీంతో ఇంటిపరిసరాల్లో విద్యుత్ తీగలను సవరిస్తున్న క్రమంలో షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు స మాచారం అందించడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై రాజన్న తెలిపారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడాలి



సభ్యులను సన్మానిస్తున్న దివాకర్‌రావు

శ్రీరాంపూర్: కార్మికుల హక్కుల కోసం నిరంతరంగా పోరాడాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు టీబీజీకేఎస్ నేతలకు సూచించారు. ఇటీవల ఎన్నికైన టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచి ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేశ్, తదితరులు ఆదివారం దివాకర్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని శాలువాతో సత్కరించారు. నూతనంగా ఎన్నికైన నేతలు ఉత్సాహంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పొగాకు రమేశ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పెండ్రి అన్వేశ్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు మస్త్యాల రమేశ్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ స్టాఫ్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం ఏఐటీయూసీ మైనింగ్ స్టాఫ్ ఆర్కే 6 గని పిట్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గనిపై జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచి సెక్రెటరీ ఎస్కె బాజీసైదా హాజరయ్యారు. కమిటీ ఉపాధ్యక్షునిగా మోతె రమేశ్, కార్యదర్శిగా కిన్నెర చంద్రమౌళి, సహాయ కార్యదర్శిగా కేదారి రమేశ్, రిలే ఏ కార్యదర్శిగా ముద్దసాని అనుదీప్, రిలే బీ కార్యదర్శిగా బొడ్డు సాయికృష్ణ, రిలే సీ కార్యదర్శిగా తాళ్ల రవికుమార్, జనరల్ షిఫ్ట్ కార్యదర్శిగా బోయిన నరసయ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నూతన కమిటీ మైనింగ్ స్టాఫ్ హక్కులు, సదుపాయాల కోసం పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ స్టాఫ్ ఏరియా ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, కార్యదర్శి మారుపల్లి బాపు, గని పిట్ సెక్రెటరీ సంఘం సదానందం పాల్గొన్నారు.

రైలుకు తగిలి ఒకరికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

మంచిర్యాలక్రైం: రైలుకు తగలడంతో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం గుర్తు తెలియని రైలుకు తగలడంతో తీవ్రగా యాలై కిందపడిపోయాడు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి వెళ్లి పరి శీలించగా అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయా డు. 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తెలిసినవారు 8328512176, 8712658596 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

చైన్ అపహరణ

నస్పూర్: స్థానిక జగదాంబ కాలనీకి చెందిన ఓ మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తి చైన్ చోరీకి పాల్పడినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. కాలనీకి చెందిన ముస్కె భాగ్యలక్ష్మి ఆదివారం ఆటో దిగి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుకనుంచి బైక్‌పై వచ్చిన వ్యక్తి ఆమె మెడలోంచి సుమారు 5 తులాల బంగారు చైన్ లాక్కెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ



ఆలయంలో పరిశీలిస్తున్న పోలీసులు

ఖానాపూర్: దిలావార్‌పూర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయం గేటు తాళం పగులగొట్టి లోనికి వెళ్లిన దుండగులు అమ్మవారిపై ఉన్న 500 గ్రాముల వెండి కిరీటంతో పాటు 15 గ్రాముల బంగారు పుస్తెలు, ఒక గ్రాము బంగారు ముక్కు పుడక, హుండీలో ఉన్న నగదును సైతం ఎత్తుకెళ్లారు. ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై శ్రీనివాస్‌వర్మ తెలిపారు.

మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ ఎన్నిక



చొప్పరి శ్రీహరి, ఉపాధ్యక్షుడు

కాసిపేట: మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీని ఆదివా రం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, వైస్ ప్రెసిడెంట్ బియ్యాల వెంకటస్వామి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చొప్పరి శ్రీహరి, కార్యదర్శిగా శంకరయ్య, సహాయ కార్యదర్శిగా ప్రశాంత్, రిలే ఏ ఇన్‌చార్జిగా శ్రీనివాస్, రిలే బీ ఇన్‌చార్జిగా దినేష్, రిలే సీ ఇన్‌చార్జిగా ఉదయ్, మహేందర్, జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జిగా రాజు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్‌గా రంజిత్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి వి.రాజేందర్, నాయకులు పార్వతి సురేష్, లింగయ్య, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీ జీఎంగా శ్రీనివాసులు



శ్రీనివాసులు

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు జీఎంగా కె.శ్రీనివాసులు పదోన్నతి పొందారు. ఇంతకాలం జీఎంగా విధులు నిర్వర్తించిన చిన్న బసివిరెడ్డి ఆదివారం పదవీ విరమణ పొందగా ఎస్టీపీపీ ఎఫ్ జీఎండీ నిర్మాణంతో ఏజీఎంగా విధులు చేపట్టి ఇప్పుడు పీసీఎస్ ఏజీఎంగా విధులు నిర్వర్తిస్తున్న కె.శ్రీనివాసులుకు పదోన్నతి కల్పిస్తూ సింగరేణి సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది.

బెదిరించి లైంగిక దాడికి పాల్పడిన ఒకరి రిమాండ్

భీమిని: కన్నెపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ మహిళను బెదిరిస్తూ రెండేళ్లుగా అత్యాచారానికి పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. మండలంలోని మెట్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధి లోని ఏసయ్యపల్లి గ్రామానికి చెందిన గో మాస దేవదాస్ రెండేళ్లుగా ఓ మహిళను బెదిరిస్తూ అత్యాచారానికి పాల్పడుతున్నా డు. తన కుటుంబాన్ని సైతం వేరు చేస్తానని భయభ్రాంతులకు గురిచేయడంతో బాధిత మహిళ కన్నెపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శనివారం రాత్రి బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గనిలో స్పృహతప్పి పడిపోయిన ప్రైవేటు ఉద్యోగి

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని గనిలో ఆదివారం ఓ ప్రైవేట్ సంస్థ ఉద్యోగి గర్మీ (వేడి)తో స్పృహతప్పి పడిపోయాడు. గనిలో కొంతకాలం నుంచి జేఎంఎస్ అనే సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. సంస్థ తరపున ఆదివారం ఫ్రీషిఫ్టుకు షరీఫుల్ల ఇస్లాం అనే ఉద్యోగి విధులకు వెళ్లాడు. గని భూగర్భంలో దిగి 67 లెవల్‌లో సపోర్టు పనులు చేస్తుండగా వేడికి తాళలేక కళ్లుతిరిగి పడిపోయాడు. వెంటనే సహచర కార్మికులు సపర్యలు చేసి గని అధికారులకు సమాచారం అందించారు. అనంతరం స్థానిక కంపెనీ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. గనిలో తగినంత గాలి సరఫరా కాకపోవడం వల్లనే సదరు కార్మికుడు స్పృహ కోల్పోయాడని కార్మికులు పేర్కొంటున్నారు. గని అధికారులు గాలి సరఫరాను మెరుగు పరిచి కార్మికుల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.

సీపీఐ రాష్ట్ర సమావేశాల్లో ఉమ్మడి జిల్లా నాయకులు

ఎదులాపురం: ఖమ్మం జిల్లా కేంద్రంలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర సమావేశాలకు ఉమ్మడి ఆదిలాబాద్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, నిర్మల్ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ పాల్గొన్నారు.